# మహిళాజ్యోతి

## మరో ప్రపంచం!

ఆ పూటకి సూర్యుడు నిద్ర కొరిగే సమయం ఆసన్నమైంది. కాలేజీ వొదిలాక రోడ్డుని సొంతం చేసుకు నడుస్తున్నారు అందులో చదివే ఆడా మగా. వాళ్ళ నోళ్ళలో రకరకాల అంశాలు నలుగుతున్నాయ్. వాళ్ళలో నలుగురు కుర్రాళ్ళకి ఆడాళ్ళని ఏడ్పించటం అంటే చాలా సరదా. ముందు మాటలతోనూ అనంతరం చేష్టలతోనూ కబళించాలనేది వాళ్ళ ఉన్నతాశయం.

ఆ పూట ముందు నడుస్తున్న వరలక్ష్మి వాళ్ళ కళ్ళబడింది. వరలక్ష్మి ఎప్పుడూ వొంటరిదే. రిజర్వ్‌డ్‌గా వుండటం అనేది ఆమెకి పుట్టుకనుంచీ పుట్టిన అలవాటు. నోరున్న ఆడదాన్ని గయ్యాళి అనీ, నోరులేని దాన్ని అబల అనీ అనడం యీ ప్రపంచానికి అలవాటు. నలుగురు కుర్రాళ్ళూ నోరులేని ఆ వరలక్ష్మి వెనకపడ్డారు. పిల్ల అరుపులూ నక్క వూళలతో ప్రారంభించారు గొడవ.

వరలక్ష్మి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయ్. పుస్తకాలు రొమ్ములకి అదుముకుని నడుస్తుంది. అడుగులు తడబడ్తున్నాయ్.

చాలామంది ఆడవాళ్ళ వీపులకి కళ్ళుంటాయని ఎవరో వొకాయనన్నారు. వరలక్ష్మి విషయంలో అలాగే అన్పిస్తుంది మరి. రాను రాను పెచ్చుమీరుతున్న వాళ్ళ అల్లరి వెనక్కి తిరిగిచూడకపోయినా ఆమె మస్తిష్కంలో ఫ్రేమ్ అవుతూంది.

రోడ్డుమీది జనం పల్చబడ్డంతో ఆ నల్గురూ ధైర్యంచేసి వరలక్ష్మికి మరీ దగ్గర కొచ్చేశారు.

“........అంత తేలిగ్గా తీసెయ్యకు బ్రదర్ వరలక్ష్మి అంటే వరాలు ఇచ్చే లక్ష్మి అని అర్థం.” అన్నాడో కుర్రాడు.

“అలాగా! ఐతే, వొకొక్కళ్ళం వొకో వరం కోరుకుందాం.” అన్నాడు రెండో కుర్రాడు.

“అదేం కుదరదు. అసలు వరాన్ని నువ్వు కొట్టేద్దామని నీ వెధవ ప్లానంతా.”

“అది కాదు గురూ ఒకే వరాన్ని ఇంత మందికి యివ్వడానికి వరలక్ష్మికి శక్తి వుందా అని.”

“వుంది గనకనే యీమె పేరు వరలక్ష్మి” అని ఆమె మీదిమీదికి వస్తున్నారు.

ఆమె గుండె ఆగిపోయే స్థితికి వచ్చేస్తోంది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళకి వాళ్ళు కిరాతకుల్లా కనిపిస్తున్నారు. వాళ్ళనేమీ అనడానికి సాహసించలేక పోతుంది.


తన ఇల్లున్న సందులోకి తిరిగేవరకూ ఆ రాక్షసుల అల్లరిని కన్నీటితోనే భరించింది.

యింటికొచ్చిన వరలక్ష్మి పుస్తకాలు కిటికీ గూట్లోకి విసిరి తన గదిలోకెళ్ళి మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

తన వానిటీ బాగ్‌లో వున్న తెల్లటి గ్లాస్కో గుడ్డతో టెలిఫోన్ తుడిచి మవుత్ పీస్ దగ్గర సెంటులో ముంచిన దూది పెట్టి బయటి కొచ్చింది ఉషారాణి. చాలా రాత్రి అయింది.

వేరే ఉద్యోగం దొరక్క తనకుగా తను ఏర్పరచుకున్న వృత్తి అది. అలా కొన్ని షాపులూ, ఆఫీసులూ, ఇళ్ళూ తిరిగి ఓ వంద ఖాతాలు ఏర్పర్చుకుంది. ఫోనుకి నెలకి రెండు




రూపాయిలిస్తారు.

ఈ ఉద్యోగం బాగానే వుంది గానీ ప్రతి రోజూ ఇంటికి వెళ్ళేసరికి చాలా ఆలస్యమౌతుంది. రాత్రి వేళలు యింటికి చేరుకోవడం ఓ సముద్రం దాటి వెళ్ళడమే ఔతుంది.

సాగర్ శిల్క్స్ అనే బట్టల షాపులో కుర్రాళ్ళకి తను మరీ చులకనైపోయిందీ మధ్య. ప్రతిరాత్రి ఏదో కూడలిలో కాచుకు కూర్చుంటున్నారు తనకోసం.

అందితే ఎత్తుకుపోదాం అనే అత్యాశ వాళ్ల కళ్ళల్లో ప్రతి చీకటి రాత్రీ తను స్పష్టంగా చూస్తోంది.

ఆలోచిస్తూ నడుస్తున్న ఉషారాణికి వాళ్ళు ఎదురవ్వనే అయ్యారు.

వాళ్ళలో ఒకడు బాగా దగ్గరగా వొచ్చాడు. వాడి ముఖం తన ముఖానికి మరీ దగ్గరగా పెట్టి అంటున్నాడు. "ముద్దనేది ముచ్చటగా ఇవ్వకూడదు ముఖమంతా నింపాలి. ఏమంటావ్?"

ఉషారాణి నరాల్లో రక్తం కళ్ళలోకి వొచ్చింది. ఏం చెయ్యలేని అసహాయురాలు. కన్నీళ్ళు నింపుకొని భయంగా, బెరుగ్గా వారిని తప్పించుకొని వడివడిగా నడిచిపోయింది.

* * *

"కళయరసి" అనే తమిళం వాళ్ళమ్మాయిని ఆ వీధిలో అంతా ఇడ్లీ సాంబార్ అని హేళన చేస్తుంటారు చాలామంది.

కళయరసి నాన్న ఆ వూరి చివర రైల్వే కాంటిన్ కాంట్రాక్టర్. మధ్యాహ్నం, రాత్రి ఆయన భోజనానికి వెళ్ళినప్పుడు కాష్‌లో కళయరసిని కూర్చోబెట్టేవాడు. ఆ రాత్రి వేళలు ఆయన భోజనానికి వెళ్తే తిరిగివొచ్చేసరికి పది దాటేది. ఆ రాత్రి వేళల్లో ఇంటికి వెళ్ళడానికి ఆమెకి విపరీతమైన భీతి. వో రాత్రి ఇంటికి వెళ్తుంటే రిక్షావాడు "వస్తావా? స్మశానాల దిబ్బల వెనక్కి పోదాం." అని రిక్ష తనముందు అడ్డుగా నిలబెట్టాడు.

స్మశానాల దిబ్బల వెనక్కి.

దేనికి? తల్చుకుంటే శరీరం రోమాంచితమౌతోంది.

భయంతో గుండెలో రక్తం గడ్డకట్టుకపోతోంది—వణుకుతూ చూసిందిరిక్షావాడివేపు.

* * *

పై మూడు సంఘటనలూ అందులోని



'తలవొంచింది-దుర్మార్గుల నెదుర్కొని తలనెత్తి నిలబడేందుకు!'
విజయవాడ మధు గార్డెన్స్‌లో కరాటే నేర్చుకొంటున్న సబలలు!

వ్యక్తుల పేర్లూ మినహాయిస్తే వాస్తవాలు. ఆడది వేటాడబడుతోంది మన సమాజంలో. అలా అని ప్రతి మగవాడూ వేటాడేవాడు కాడు. ఆడదాన్ని కేవలం విలాస వస్తువుగా మాత్రమే చూస్తున్న కొంత శాతం మగమహారాజుల ఆట అది. ఆ సంఘటనలు మరోలా ఎందుకు జరగకూడదు? దుర్మార్గం తలపెట్టే మగవాడిపై ఎందుకు పోరాటం జరిపే ధైర్యం చేయకూడదు ఆడది? అలా అయితే....మళ్ళీ అవే పాత్రలు అవే సంఘటనలు ఈ క్రిందివిధంగా జరగొచ్చుకదా?

* * *

ఓ సాయంత్రం వేళ కాలేజీ వదిలాక రోడ్డుమీదికి వచ్చిన వరలక్ష్మిని నల్గురు కుర్రాళ్ళూ అటకాయించారు.

"వరలక్ష్మి అంటే వరాలిచ్చే లక్ష్మిరా," అన్నాడు ఓకుర్రాడు ఆమెకి ఎదురుగా నిలబడి.

వరలక్ష్మి జంకలేదు. భీత హరిణంలా ఆమె కళ్ళు చలించలేదు.

సూటిగా ఆమాట అన్నవాడి కళ్ళలోకి చూస్తూ "ఏ వరం కావాలో కోరుకో" అంది.

ఆమె జవాబుకి షాక్ ఐన కుర్రాడు తన నోట్లోంచి మాటల ముక్కల్ని వదిలాడు. "నా....నా....ఒక్కడికే కాదు మా....నలుగురికీ......."

"సరే అందుకోండి" అని తన రెండు చేతులు గాలిలోకి విసిరింది. వాళ్ళ డొక్కల్లో కత్తుల్లా గుచ్చుకున్నాయ్ ఆమె చేతులు. సుత్తి పోట్లలా పడ్డాయ్ ఆమె పిడికిళ్ళు.

క్షణాల కాలంలో స్త్రీ మీద వాళ్ళకున్న స్వల్పమైన అభిప్రాయాలు చిన్నాభిన్నమయ్యాయ్. నేలమీద స్పృహతప్పి పడ్డారు.

♦ ♦ ♦

"ముద్దనేది ముచ్చటగా ఇవ్వకూడదు ముఖమంతా నింపాలి. ఏమంటావ్?" ఆ రాత్రి ఆ కూడలిలో ఉషారాణి చుట్టూ మూగిన బట్టల కొట్టు కుర్రాళ్ళలో ఒకడు అలా అన్నాడు భుజంమీద చెయ్యేసి.

"చెంపదెబ్బ కొడితే చెయ్యంతా ముద్ర పడాలంటాను." ధైర్యంగా అంది ఉషారాణి.

"జోకులు బాగా పేలుస్తావే."

"చెంపలుకూడా" ఛెళ్ ఛెళ్ మన్నాయ్ తన మీదికొస్తున్న వాళ్ళందరి చెంపలూ.

"ఇంతసేపూ మొగలిరేకులా పరిమళించిన ఈ ఆడది ముళ్ళకత్తిలా తయారైందేమిట్రా బాబూ!" అని వాళ్ళంతా వేగంగా అక్కడి నుంచి పరుగుపెట్టారు పడ్తూ లేస్తూ.

* * *

"స్మశానాల దిబ్బల దగ్గరకా....

....నిన్ను పూడ్చేదానికి రావాలిగా మరి?"

"ఏంటి పిల్లా జోరు?" రిక్షావాడి మాటల్లో వ్యంగ్యం.

అంతే___

కళయరసి పిడికిలి రిక్షావాడి పొత్తి కడుపులో దిగింది మొనలేని గునపంలా.

భళ్ళున వాంతి చేసుకున్నాడు వాడు.

"జాగ్రత్త ఆడదానివైపు వోచూపు, మగాడి వైపు మరో చూపు చూడ్డం మానుకో ఈ రోజునుంచి" అని హుంకుంచేసి నిష్క్రమించింది కళయరసి.

* * *

[మరుమల్లె, ముద్దబంతి, సన్నజాజి, ఇలా ఎన్నెన్నో పుష్పాలతో పోల్చబడుతుంది స్త్రీ. లాలిత్యానికి ప్రతీకగా వర్ణించబడుతుంది. నిజమే! లాలిత్యానికి ప్రతీకే స్త్రీ. కాని ఆపద ఎదురైనప్పుడు కాదు. కాకూడదు. హఠాత్తుగా లతలాటి స్త్రీ మేకులా కఠినత్వం పొందలేదు. కొంత ప్రయత్నం అవసరమే. నిజానికి మొదటి వాస్తవ సంఘటనలకి, వాస్తవాలు కావాలని ఆశిస్తూ ఊహించి రాయబడ్డ తరువాతి సంఘటనలకీ మధ్య కేవలం ఊహ కాక కొంత ఆధారం కూడా ఉంది. 'యువతీ ఆత్మ రక్షణా ట్రయనింగ్ అసోసియేషన్' పేరిట కొందరు మహిళలు నిర్వహించే 'యువతీ ఆత్మరక్షణా ట్రయనింగ్ స్కూలు' (విజయవాడలోని మధు గార్డెన్స్‌లో) దాదాపు వందమంది 'టీన్ ఏజ్'లో వున్న అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం చూసినప్పుడు అన్పించింది 'ఆ సంఘటనలు ఇలా ఎందుకు జరగకూడదూ?' అని__ఎందుకు జరగకూడదు?] __'సత్యవంశి'

---

# యాజమాన్యం తదితర వివరాలు 'జ్యోతి'


ఫారం 4 ( 8వ నిబంధన ప్రకారం )

ప్రచురణ స్థలం : మద్రాసు

ఎంతకాలానికొకసారి : మాసపత్రిక

ముద్రాపకుని పేరు, జాతి, విలాసం: శ్రీ డి. హనుమంతరావు, భారతీయుడు, 2. ఫ్రాన్సిస్‌జోసఫ్ స్ట్రీట్, మద్రాసు-1.

ప్రకాశకుని పేరు, జాతి, విలాసం : శ్రీమతి వి. లీలావతి, భారతీయురాలు 17బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024,

సంపాదకుని పేరు, జాతి, విలాసం : శ్రీమతి వి. లీలావతి, భారతీయురాలు, 17బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024

పత్రిక యజమానురాలు : శ్రీమతి వి. లీలావతి

పై విషయాలు నాకు తెలిసినంతవరకూ వాస్తవమైనవని తెలియజేయుచున్నాను.

మద్రాసు - 600 024. (సం) వి. లీలావతి